నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 3 డిసెంబర్ 2024 | KARIMNAGAR

## పెండింగ్ జీతాలు చెల్లించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్స్ సభ్యులు, నాయకులు

జగిత్యాల, డిసెంబర్ 2 : తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీపీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ధర్నాలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు మునుగురి హనుమంతు, కార్యదర్శి ఎండీ ఉస్మాన్, జగిత్యాల మండల ఇన్‌చార్జి వెన్న మహేశ్, నాయకులు, బిట్కు రాములు, మోతి మహేశ్, సతీశ్, తిరుపతి, గంగు, నర్సు పాల్గొన్నారు.



మెట్‌పల్లి: ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, తదితరులు

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుదాం

- బీఆర్ఎస్ చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరిద్దాం
- కేసీఆర్ మొక్క కాదు.. ఆయన వేగు చుక్క
- డీలా పడొద్దు.. కేసులకు భయపడొద్దు
- కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య శ్రేణులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిశానిర్దేశం
- హైదరాబాద్‌లో సమావేశం


మెట్‌పల్లి, డిసెంబర్ 2 : ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుదామని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధులు, ముఖ్యకార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నేతృత్వంలో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత దిశానిర్దేశం చేశారు. అధికారం లేదని కార్యకర్తలు డీలా పడొద్దని, కేసులకు భయపడొద్దని, కార్యకర్తలకు లీగల్‌సెల్ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగా కొట్లాడుదామని, సర్కారు వాళ్లదే అయినా గెలిచే సత్తా మనకే ఉందన్నారు. కేసీఆర్ అనే మొక్కను పీకేస్తానని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, కేసీఆర్ మొక్క కాదని, ఆయన ఒక వేగు చుక్క అని స్పష్టం చేశారు. రేవంత్ గురువుకే చుక్కలు చూపించి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. మన ప్రభుత్వం ఉన్నప్పుడు నిధులు వరదల్లా పారాయని, ఇప్పుడున్న ప్రభుత్వంలో తిట్లు పారుతున్నాయని, 'యథారాజా తథా ప్రజా' అన్నట్టు ముఖ్యమంత్రి, మంత్రులు తిట్ల దండకమే తప్ప మరొకటి లేదని విమర్శించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల మండల శాఖ అధ్యక్షులు ఎలాల దశరథరెడ్డి, తోట శ్రీనివాస్, నల్ల తిరుపతిరెడ్డి, దారిశెట్టి రాజేశ్, మాజీ ఎంపీపీలు మారు సాయిరెడ్డి, జాజాల భీమేశ్వరి, నాయకులు జేడీ సుమన్, దేవ మల్లయ్య, ఏనుగు రాంరెడ్డి, పుప్పాల నర్సయ్య, రాజారెడ్డి, దోమకొండ చిన్న రాజన్న,రాయల్, అంజయ్య, జగన్‌రావు, పుల్ల జగన్, బద్దం శేఖర్‌రెడ్డి, నోముల లక్ష్మారెడ్డి, కందరి ప్రతాప్‌రెడ్డి, ఆరేళ్ల రాజాగౌడ్, ఆకుల రాజారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రవి, నత్తి రాజ్‌కుమార్, కంటం రమేశ్, మామిడి సురేశ్‌రెడ్డి, దొంతుల తుకారాం, పీసు తిరుపతిరెడ్డి, సాగర్, సురేందర్ పాల్గొన్నారు.

# కుళ్లిన గుడ్లు.. నాణ్యతలేని భోజనం

- పాఠశాలల్లో తిష్టవేసిన సమస్యలు
- సరైన వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- బీఆర్ఎస్వీ గురుకుల బాటలో బయటపడుతున్న లోపాలు
- పలుచోట్ల అనుమతి పేరుతో లోపలికి రాకుండా అడ్డుకున్న సిబ్బంది
- వాగ్వాదానికి దిగిన నాయకులు



తాటిపల్లి గురుకుల పాఠశాలలో కుళ్లిపోయిన కోడిగుడ్లు



పెద్దపల్లి రూరల్: బాలుర ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల బాత్రూంలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు



కరీంనగర్ గురుకుల పాఠశాలలోని భోజనాల పరిస్థితిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

బీఆర్ఎస్వీ గురుకుల బాటలో ఎన్నో లోపాలు బయటపడుతున్నాయి. విద్యార్థులు పడుతున్న అవస్థలు వెలుగులోకి వస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ నాయకులు సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలుచోట్ల పరిశీలనకు వెళ్లగా అనేక సమస్యలు స్వాగతం పలికాయి. కుళ్లిన గుడ్లు తినలేక.. సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. పలు చోట్ల అనుమతి పేరిట పాఠశాలల లోపలికి రాకుండా సిబ్బంది గేట్లు వేసి అడ్డుకోవడంపై నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. పరిశీలనకు వెళ్తే అడ్డుకోవడం, అరెస్ట్ చేయడం ఏంటని నిలదీశారు.



తాటిపల్లి గురుకుల పాఠశాలలో క్షేత్రస్థాయి సమస్యలపై ఆరా తీస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

## సమస్యలపై నిలదీస్తాం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, డిసెంబర్ 2 : గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హెచ్చరించారు.సోమవారం ఆయన మల్యాల మండలంలోని తాటిపల్లి గురుకుల పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ క్రమంలో విద్యార్థులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. వంటగదిలోని పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ పాఠశాలలో విద్యార్థులకు స్నానం చేసేందుకు వేడి నీరు అందడం లేదని, డార్మెటరీ హాల్ సరిగా లేక ఒకరు పడుకునే స్థానంలో ఇద్దరు పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కుళ్లిన కోడిగుడ్లను అందిస్తున్నారని, దుప్పట్లు లేక చలికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బాలికలకు కాస్మొటిక్ కిట్లు అందజేయడం లేదని విమర్శించారు. కోతుల బెడద సైతం ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఓసారి తమ పరిధిలోని గురుకుల పాఠశాలను సందర్శించాలని హితవుపలికారు. ఆయన వెంట నాయకులు బంద అంజయ్‌కుమార్, జనగం శ్రీనివాస్, అయిల్నేని సాగర్‌రావు, తైదల శ్రీలత, చందు, అజహరోద్దీన్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల కలెక్టర్‌తో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## విద్యారంగం నిర్వీర్యం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 2 : కాంగ్రెస్ సర్కారు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మండిపడ్డారు. సోమవారం జగిత్యాలలోని ధరూర్ క్యాంపులో ఉన్న గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె సందర్శించారు. అక్కడున్న విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సౌకర్యాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు నడుచుకుంటూ వెళ్లి 'ప్రజావాణి'లో సమస్యలను కలెక్టర్‌కు తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని డీఈవోను ఆదేశించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు అత్యంత దయనీయం పరిస్థితిలో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అరకొర నిధులు ఇస్తున్నదని, కనీసం నాణ్యమైన భోజనం పెట్టలేని పరిస్థితిలో ఉందని ధ్వజమెత్తారు. కాస్మొటిక్ చార్జీలు పెంచారంటూ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకుంటున్నారని, కానీ హాస్టళ్లలో కనీసం సబ్బులు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, చింత గంగాధర్, వెంకటేశ్వర్లు, గంగారెడ్డి, చిట్ల రమణ, ప్రణయ్, భగవాన్ మనోజ్, నాయకులు పాల్గొన్నారు.



గురుకులం విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చందర్

## రాష్ట్రంలో నిర్బంధ పాలన

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, డిసెంబర్ 2: రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతున్నదని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన గోదావరిఖనిలోని మైనార్టీ పాఠశాలను సందర్శించారు. అయితే, బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారన్న సమాచారంతో పాఠశాల సిబ్బంది గేటు వేసి లోనికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. అనుమతి లేనిదే లోనికి రావొద్దనడంతో అక్కడే వేచి ఉండి విరామ సమయంలో బయటకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, విలేకరులతో మాట్లాడారు. గురుకులాల బాటలో భాగంగా విద్యార్థుల స్థితిగతులను తెలుసుకునేందుకు వస్తే అధికారులు అనుమతి లేదని అంటున్నారని, పోలీసులతో అడ్డుకుంటున్నారని, ఇది దుర్మార్గపు పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. నిర్బంధ పాలనకు ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గురుకుల పాఠశాలల్లో పిల్లలకు ఏ ఇబ్బందులు కలిగినా పాలకులు, ప్రిన్సిపాల్ వహించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మున్సిపల్ కార్పొరేటర్ కల్వచెర్ల కృష్ణవేణి, నాయకులు అచ్చె వేణు, నారాయణదాసు మారుతి, చుక్క శ్రీనివాస్, సట్టు శ్రీనివాస్, బొడ్డు రవీందర్, జడ్సన్, ఇరుగురాళ్ల శ్రావణ్, కిరణ్, రామారాజు, ఆవునూరి వెంకటేశ్, చింటూ, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ మోసాలపై కరపత్రం ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

## సంబురాల పేరిట ఆగం చేస్తున్రు

- సర్కారుపై నమ్మకం సన్నగిల్లింది
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి, డిసెంబర్ 2 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది కాలంలో అన్నీ చేశామంటూ సంబురాల పేరిట ప్రజలను ఆగం జేస్తున్నదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లో భాగంగా సోమవారం రామగిరిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేవంత్ సర్కారు అన్ని రంగాల్లో విఫలమైందని, ఏ వర్గానికీ మేలు చేయకుండా కేవలం గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమైందని మండిపడ్డారు. మంథని ఎమ్మెల్యే గతంలో ఐదుసార్లు స్థానిక ప్రజలను మోసం చేశారని, ఈసారి ఏకంగా 420 హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రుణమాఫీ, రైతు భరోసా పేరుతో దగా చేసిన రేవంత్ సర్కారు సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామంటూ ముందస్తుగా సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 4న పెద్దపల్లి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర యువతకు, విద్యార్థులకు ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యా భరోసా కింద రూ. 5 లక్షల కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఐదు రూపాయలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు ఇస్తే వాటికి ఇప్పుడు ఆర్డర్ కాపీలు ఇచ్చి తామే ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

## ఎల్‌సీడీసీ బకాయిలు చెల్లించండి

- లేకుంటే మరో సర్వే చేయం
- పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తల నిరసన

పెద్దపల్లి, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): ఇప్పటికే పూర్తయిన కుష్టు(ఎల్‌సీడీసీ) సర్వేకు సంబంధించిన ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. లేకుంటే మరో సర్వే చేసేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ కార్యకర్తలు స్థానిక కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో ప్రసన్నకుమారి అక్కడికి చేరుకుని సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా ఎల్‌సీడీసీ సర్వేలు చేస్తున్నామని, సర్వేకు సంబంధించి మెయిల్ వర్కర్ కూడా ఉండాలని చెప్తే వారిని సైతం నియమించుకొని సర్వేలు చేశామని, వారికి తామే డబ్బులు చెల్లించామని, చాలీ చాలని జీతాలతో జీవితాలను ఒడ్డెక్కిస్తున్నామని వాపోయారు. తమకు వెంట వెంటనే సర్వే డబ్బులు చెల్లించకుండా జాప్యం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఒక సర్వే పూర్తి కాక ముందే మరో సర్వే చేయాలని ఆదేశాలు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎల్‌సీడీసీ సర్వే పూర్తి చేసిన తమకు ఇమ్యూనైజేషన్ సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయని, అది చేస్తుండగానే మళ్లీ బీసీజీ సర్వే చేయాలని పేర్కొన్నారని తెలిపారు. ఆ సర్వేలు పూర్తి కాక ముందే తాజాగా, సోమవారం నుంచి ఎల్‌సీడీసీ సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఇలా ఏక కాలంలో అనేక సర్వేలు చేయడం ఎవరితోనైనా సాధ్యమవుతుందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏ ఆదేశాలు ఇచ్చినా తాము పాటిస్తామని, కానీ ఇప్పటికే బకాయిలు ఉన్న ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించిన డబ్బులను వెంటనే చెల్లించాలని, అప్పటి వరకూ ఏ సర్వేలు చేయమని డీఎంహెచ్‌వోకు తేల్చి చెప్పారు.

# మళ్లీ కొందరికే మాఫీ !



ఒకేసారి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు విడుతల వారీగా కూడా పూర్తి స్థాయిలో చేయలేక పోతోంది. మాఫీ జరుగుతుందని ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతున్నది. దీంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రీ షెడ్యూల్ చేసుకోలేని పరిస్థితి వస్తున్నది. అర్హులని తేలినా రైతులకు చివరి నాలుగో విడుతలోనూ ప్రభుత్వం పూర్తి స్థాయిలో మాఫీ చేయలేక పోయింది. ఐదో విడుత ఉంటుందని అధికారులు చెబుతున్నా రైతులు మాత్రం నమ్మడం లేదు. దీంతో రైతాంగం రుణమాఫీ అవుతుందో లేదో అనే మీమాంసలో పడ్డది.

- 14,110 కుటుంబాల్లో సర్వే
- నాలుగో విడుతలో ఇచ్చింది 9,267 మందికే..
- ఐదో విడుత ఉంటుందంటున్న అధికారులు
- నమ్మకం లేదంటున్న రైతులు

కరీంనగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులందరికీ ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మించిన కాంగ్రెస్ ప్రభుత్వం విడుతల వారీగా చేపట్టింది. ఇప్పటి వరకు నాలుగు విడుతల్లో రుణమాఫీ చేసినా పూర్తి స్థాయిలో చేయలేక పోయింది. ఒక్క కరీంనగర్ జిల్లాలో మూడు విడుతల్లో 71,102 మంది రైతులకు రూ.546.26 కోట్లు మాఫీ చేయగా తాజాగా, నాలుగో విడుతలో 9,267 మందికి రూ. 84.01 కోట్లు మాఫీ చేసింది. మొత్తంగా నాలుగు విడతల్లో 80,369 మంది రైతులకు సంబంధించిన రూ.630.26 కోట్లు మాఫీ అయినట్లు అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తోంది. నిజానికి రుణమాఫీ జరిగిన మొదట్లో తమ పేర్లు రాలేదని వేలాది మంది రైతులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో కొందరికి రేషన్ కార్డు లేక పోవడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులతో సర్వే చేయించింది. ఇందులో 14,110 మంది రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ జరిగింది. వీరంతా కూడా రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతులు కాగా, నాలుగో విడుతలో మాఫీ వర్తిస్తుందని ఆశించగా కేవలం 9,267 మందికి మాత్రమే వర్తించింది. కుటుంబ సభ్యుల నిర్ధారణ జరిగిన ఇంకా 4,843 మందికి మాఫీ కావాల్సి ఉంది. నిజానికి ఇంతకంటే ఎక్కువ మంది రైతులకు మాఫీ వర్తించాల్సి ఉంది. ఇప్పటికీ వందలాది మంది రైతుల వివరాలు రుణమాఫీ జాబితాలో గల్లంతయ్యాయి. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించిన సమయంలో ఈ సమాచారం రైతులకు తెలియక చాలా మంది తమ పేర్లు నమోదు చేయించుకోలేక పోయారు. రూ.2 లక్షలలోపు రుణం తీసుకున్న రైతుల్లో చాలా మంది ఇప్పుడు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. ఐదో విడుత వస్తుందని అధికారులు చెబుతున్నా కుటుంబ సభ్యుల నిర్ధారణ జరిగిన వారికి మాత్రమే వర్తించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన రైతుల పరిస్థితి ఇపుడు ఆగమ్యగోచరంగా మారింది.

### ఆది నుంచి గోప్యమే..

జిల్లాలో ఎంత మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు, రూ.2 లక్షలలోపు ఎంత మంది ఉన్నారు, ఆపైన ఎంత మంది తీసుకున్నారనే విషయాన్ని ప్రభుత్వం ఆది నుంచీ గోప్యంగా ఉంచుతోంది. ఈ వివరాలు ఇటు వ్యవసాయ శాఖలోగానీ అటు లీడ్ బ్యాంకులోగానీ అందుబాటులో లేవు. ఇక్కడి అధికారులను ఈ విషయం అడిగితే సీసీఎల్‌ఏ నుంచి పర్యవేక్షణ జరుగుతోందని, ఆ వివరాలు తమ వద్ద లేవని చెబుతున్నారు. నిజానికి జిల్లాలో 93 వేలకుపైగా రైతులు రుణాలు పొందినట్లు గతంలో అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం తెలుస్తోంది. ఇప్పుడు ఈ వివరాలను అధికారులు నిర్ధారించలేక పోతున్నారు. ఈ లెక్కన చూస్తే మరో 12 వేల మంది రైతులకు రుణమాఫీ జరగాలి. ఒక వేళ ఐదో విడుత ఇచ్చినా కేవలం కుటుంబ సభ్యుల నిర్ధారణ జరిగిన కేవలం 4,843 మందికి ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కాగా రూ.2 లక్షలకుపైగా రుణాలు తీసుకున్న రైతుల విషయంలోనూ రైతులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రూ.2 లక్షలలోపు తీసుకున్న రైతులకు సంబంధిన రుణాలను మాఫీ చేయడంలోనే ప్రభుత్వం ఇంతగా తాత్సారం చేస్తుంటే.. అంతకు మించి రుణాలు తీసుకున్న వారి గురించి పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. రుణమాఫీ కింద ప్రభుత్వం చెల్లించే రూ.2 లక్షలలోపు రుణం మినహాయించుకుని బ్యాంకుల్లో చెల్లించేందుకు వెళ్తున్న రైతులకు అక్కడ నిరాశే ఎదురవుతున్నది. ఒకేసారి పూర్తి మొత్తాన్ని చెల్లిస్తే తప్ప తీసుకునేది లేదని బ్యాంకర్లు తేల్చి చెబుతున్నారు. ఈ విషయంలో బ్యాంకులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాక పోవడంతో రూ.2 లక్షలకుపైగా రుణాలు తీసుకున్న రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి.